# భారత మహిళామండలి, బెజవాడ

## 13వ వార్షికోత్సవ అధ్యక్షోపన్యాసము

### శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

సోదర సోదరీమణులారా!

"భగవానుని కృపావిశేషంచేత నేడు మిమ్ములను కలుసుకొనే భాగ్యం కలిగినందుకు చాలా సంతోషిస్తున్నాను.

జనవరినెలనే యీ వార్షికోత్సవం జరుగవలసివుండెను. అట్లాగే జరిగివుండినట్లైతే నాకు మీ సాహచర్యభాగ్యం కలిగేదేకాదు. అప్పుడు నాకు కల్గిన యిబ్బందులు తెలియబడకుండానే అప్రయత్నంగా యీ వార్షికోత్సవం వాయిదాపడటమూ రెండు మాసములకు తర్వాత నేను నాకుగల్గిన వ్యాధుల నుండి విముక్తనై మీ సన్నిధికి రావడమూ కేవలం భగవంతుని వాత్సల్య విశేషమనిగాక మరేమని చెప్పగలము? భగవంతునకు నా ధన్యవాదాలు. సోదరి శ్రీమతి రాజరాజేశ్వరమ్మగారికి నాపైగల ప్రేమ అపారం. 1929 సంవత్సరంలో ఈ పురంలో ఆంధ్రమహాసభతోపాటు ఆంధ్రమహిళాసభ జరిగినపుడు నన్ను ప్రయత్నపూర్వకంగా తొలిసారి వుపన్యాసవేదిక నెక్కించి సభలలో ఉపన్యసించు అభ్యాసానికి విఘ్నేశ్వర పూజచేయించిరి. నేడు ఆ ప్రేమభరిత హృదయంతోనే తమ కార్యనిర్వాహక వర్గమువారితోగూడి యీ ఆధిపత్యమునకు అవకాశం గలిగించిరి. కాని యీ సమ్మానమునందుకోడంలో నాకు మాత్రం జంకుగానే వున్నది. యీ ఆధిపత్యానికి సాధారణంగా ఆంగ్ల విద్యాధికలైనవారు, ఉన్నతోన్నత పదవుల నధిష్టించిన వారు మాత్రమే వస్తూవున్నట్లు వినికిడి. అటువంటి సందర్భంలో నావంటి సామాన్యురాలు మిమ్ముల నేమాత్రము సంతుష్టిపరచగలదనేదే నా సందేహము. అయినా యే వాత్సల్య పూర్వకమైన ఆదరంతో నన్ను ఆహ్వానించారో ఆ ప్రేమాకలిత హృదయంతోనే నా అసమర్ధతను సహింపగలరనే నమ్మకంతో సమ్మతించితిని. తప్పులుంటే క్షమించాలె.

మన తెలుగుసీమలో స్త్రీ సమాజాలు ఉద్భవించి దాదాపు ముప్పదిసంవత్సరాలైనది. అయినా స్త్రీ సమాజాలు యిప్పటికీ పొందవలసినంత అభివృద్ధిని పొందలేదని చెప్పడానికి విచారం కలుగుతున్నది. వింతలలోవింత ఏమిటంటే ఎవరి నిమిత్తమై యే సంఘాభివృద్ధి నిమిత్తమై యీ సమాజాలు పుట్టినాయో ఆ స్త్రీలకు యివంటే బెరుకూ, ఆక్షేపణ పోలేదు. కంచెయే చేనుమేసినట్లుగా స్త్రీలే వీటిపై నిందాత్మకమైన మాటలు విసురుతూ వుంటారు. నిరుత్సాహకరమైన పలుకులు పలుకుతూ వుంటారు. కేవలం కాషాయ వస్త్రమే కట్టుబట్టగా కట్టుకొని గురుశుశ్రూషయే లక్ష్యంగా పెట్టుకొని భగవదారాధనయే పరమార్థంగా బెట్టుకొని, కాలంగడిపే భక్తిపరురాండ్రూ, ఇల్లు వెడలకపోవడమే సాధ్వీధర్మంగా బెట్టుకొన్న యిల్లాండ్రూ సినిమాలుమీదనైనా ఆంక్ష తొలగించారుగాని స్త్రీ సమాజాలమీద మాత్రం నిషేధం తొలగించలేదు. స్త్రీ సమాజాలమీద స్త్రీలకే యింత శీతకన్నెందుకు? ఎచ్చటికీ పోనివారు యిచ్చటికీరారు సరే. కాని పురాణాలకూ, హరికథలకూ, నామ సప్తాహాలకూ, గురూపదేశాలకూ, నిరాక్షేపణగా తండోపతండాలుగా వెళ్లే

వారుగూడా వీటి కెందుకురారు? అక్కడ పురాణాలు, పుణ్యకథలుచెప్పే పురుషులు స్త్రీలనెంత ఆక్షేపిస్తున్నా, ఎక్కడబట్టినా యీ ఆడమూకతో చచ్చిపోతున్నామని యెంత విసుక్కుంటున్నా, ఈ ఆడవారంతా అక్కడే మూగడమెందుకు? దీనికి ప్రబలమైనకారణం వకటి కనుపిస్తున్నది. మనలో అంతులేని పుణ్యాపేక్ష ఒకటి జీర్ణించి శల్యగతమై ఉన్నది. అది అటువంటి పురాణ కాలక్షేపాది ప్రదేశములకు పోతేనే లభ్యమౌతుందనే తలంపొకటి ఉన్నది. అక్కడికి పోయి సంపాదించిన పుణ్యం మనల నెక్కడికో అనన్య దుర్లభమైన స్వర్గసీమలకు కొనిపోతుందనే భ్రమ వకటివున్నది. అటువంటి అమూల్యపదవిని అందించే సత్తా స్త్రీ సమాజాలకు లేదనే అపోహ వకటి వున్నది. పైగా అటువంటి కాలక్షేపాలకు పోవడము సదాచారము. సత్సాంప్రదాయము. సనాతనధర్మము. ఇది నవీనమార్గము. ఆక్షేపణీయాంశము. స్త్రీ ధర్మ విరుద్ధము. అది ముముక్షుపథము. ఇది ఐహికలంపటత్వము. ఎప్పటికైనా అది ముక్తినిస్తుందిగాని యిది కాదు, అనే నిశ్చితాభిప్రాయ మొకటి స్త్రీలల్లో పాదుకుపోయింది. స్త్రీలు పుణ్యపిపాస యింతగా కల్గియుండటము గొప్పమాటే. అయినప్పటికి ఆ పుణ్యార్జనకు మార్గమింత సంకుచితముగా వుండటముమాత్రం ఒప్పుకోవలసిన మాటగాదు. ఒట్టొట్టి ఉరుకులవల్లనే పుణ్యం అరచేతి నిమ్మపండవుతుందని యెవరుగాని భావించడం పొరపాటు. అజ్ఞానం. మోక్షం వూరికేరాదు. అనంతమైన మనస్సంస్కారం ఉండాలె. అసమానమైన స్వార్థత్యాగం వుండాలె. అసదృశమైన నిర్లిప్తభావముండాలె. మోక్షమంటే సంసార జంఝాటంలో ఉండీ నిరపేక్షులై లోకోపకారమైన సేవాధర్మంతో పారమార్థిక జీవితాన్ని గడపడమేగాని యెక్కడో చచ్చి స్వర్గసీమలలో ఊహాకందని సుఖానుభవం పొందుతా మనుకోడంగాదు. సత్యము, శీలము స్వార్థత్యాగము ఉంటే యే మార్గములోనూ పుణ్యమే సంపాదించవచ్చు. సేవయొక్క పరమార్థం తెలుసుకొని తమజీవితాన్ని పరార్థసేవకు అంకితం చేసుకున్నట్లయితే పుణ్యంకొరకూ, మోక్షంకొరకూ ప్రత్యేక ప్రయత్నం అక్కరలేదు.

ఏమనిషిగాని తనమట్టుకు తాను సుఖంగా ఉంటేచాలు ననుకోడం స్వార్థం అనిపించుకుంటుందిగాని తన జాతియొక్క తన సంఘంయొక్క మేలుచూడడం స్వార్థం అనుపించుకోదు. పైగా విధాయకధర్మం కూడా అయివున్నది. ఒక్కమాట. మీ మనస్సులో, మనం యేదేశంలో పుట్టాము? యే సంఘంలో పుట్టాము? ఏజాతికి చెందియున్నాము. మన మంచిచెడ్డలేమిటి? యావత్ప్రపంచంలోనూ స్త్రీలు వున్నారు గదా వారంతా ఎట్లావున్నారు? మన మెట్లాయున్నాము? అని ప్రశ్నించుకొన్నట్లైతే కొంతైనా మీ పరిస్థితి అవగాహన అవుతుంది. మన మూకీభావం అనర్థదాయకమనీ, మనం యెండమావులవెంట పరిభ్రమిస్తున్నామని తెలిసిపోతుంది. తెలుసుకున్న తర్వాత ఊహించండి. యుగయుగాలుగా వెంటాడివస్తూన్న యీ అజ్ఞానం, యీ బానిసతనం, ఈ ఆర్థికదారిద్ర్యం ఎట్లా నివారణ అవుతాయి అనిపిస్తుందో లేదో! అనిపించగానే మార్గమేమిటని వెంటనే వెతుక్కుంటాము. కలి యుగంలో సంఘశక్తి బలవత్తరమైందని పెద్దలు చెప్పేఉన్నారు. సంఘశక్తిద్వారానే మనంకూడా మన పనులు సాధించుకోవాలె. సంఘాలంటే యేమిటి? సమాజాలే. స్త్రీలకేవిధమైన హక్కులు, అధికారములు, బాధ్యతలు, కావాలెనన్నా అవి స్త్రీ సమాజాల ద్వారానే పొందాలె. స్త్రీ సమస్యలను పరిష్కరించడానికి స్త్రీ సమాజాలొక్కటే చాలివున్నవి. స్త్రీ సమాజము లంటే స్త్రీ జన కల్పకాలు.

మనదేశంలో ఉన్న స్త్రీ సమాజాలే చాలాకొద్ది. ఆ వున్నవైనా అన్నీ ఒక ముఖంగాలేవు. కొన్ని చిరతలు తాళాలు ముందు బెట్టుకొని భక్తసమాజాలుగా పరిగణింపబడుతున్నవి. కొన్ని పత్రికలు, పుస్తకాలు పెట్టుకొని విద్యాభివృద్ధిని కోరేవిగా వుంటున్నవి. కొన్ని బ్యాట్లు, బంతులు చేతబట్టుకొని క్రీడాసక్తిని పురిగొల్పేవిగా ఉంటున్నవి. వీనిలో యితర కార్యక్రమములు మరికొన్ని జరుగుతూ వుండవచ్చు, గాని ముఖ్య లక్ష్యాలివిగా కనిపిస్తున్నవి. ఈ లక్ష్యభేదాన్నిబట్టి అభిప్రాయ భేదాలుకూడా యేర్పడి వకరు చేసేది వకరికి అనుచితంగా తోస్తున్నది. భక్తి లక్ష్యం గలవాళ్లు; విద్యాలక్ష్యం గలవాళ్లని చూచి ఏమిటీ అజ్ఞానం - పత్రికలవల్ల, పుస్తకాలవల్ల ఏమివస్తుంది, ముక్తిమార్గం చూచుకోక, అనుకుంటున్నారు.

విద్యాలక్ష్యం గలవాళ్లు, క్రీడాలక్ష్యంగలవాళ్లని చూచి, ఏమిటీ అజ్ఞానం - యీ ఆటపాటలవల్ల యేమివస్తుం దనుకుంటున్నారు. క్రీడాలక్ష్యంగలవారు పైయిరువురినిచూచి భజనలు, పురాణాలు, గ్రంథాలు, పత్రికలు, ఏమిటీ వెర్రి. చదువుకోవాలంటే యింట్లోలేవూ, హాయిగా కాశేపు సరదాగా ఆటపాటలతో కాలక్షేపంచెయ్యక, అనుకుంటున్నారు. ఒకరిది సనాతన పంథా. ఒకరిది దేశవాళీపద్ధతి. ఒకరిది పాశ్చాత్యానుకరణము. మొత్తంమీద చదువే ముఖ్యమనుకునే నావంటి మధ్యరకంవారికి అవస్థగానే వున్నది. భక్త సమాజాలు నడిపేవారు మాకున్న భక్తి ప్రపత్తులు మీకులేవని చిన్నచూపుచూస్తే, పాశ్చాత్య పద్ధతులు ఆచో దించేవారు ఆపాదమస్తకం మమ్ములను పరికించి యీనాటి సరకుతో మసలడం మనకు లాయకీకాదను కుంటున్నారు. భజనలు చేయలేకపోయినా భగవద్భక్తి మాకూ ఉన్నదర్రా అంటే వాళ్లు నమ్మరు. ఆటలంటే మాకూ రక్తిఉన్నది, నిలిచి వూరికే బంతిఆటలు ఆడలేకపోయినా కూర్చిండి ఆడే (క్యారమ్‌బోర్డు వగైరా) ఆటలు ఆడగలమంటే వీళ్లూ నమ్మరు. ఇవొక్కటేనా? యింకా వీనిలో డబ్బు హోదా, అధికారము, వర్ణమునకు సంబంధించిన తరతమ భేదాలెన్నో కానవస్తున్నాయని లోకంలో వాడుకపడ్డది. సామాన్య స్త్రీలకూ, తెలుగే వచ్చినవాళ్లకూ, హోదాలేమీ లేనివాళ్లకూ లేడీసు క్లబ్బులలో తావులేదని పలువురు చెప్పగా వినడం సంభవిస్తున్నది.

ఈ విధంగా దేశంలో ఉన్న స్త్రీ సమాజాలు పలుపోకలుగా ఉండటంచేత సరియైన సంఘ బలమునూ, ప్రజాదరమునూ పొంది చేయవలసినంత ఉపకారమును చేయలేకుండా ఉన్నవి. నిజమాలోచిస్తే ఒక్కొక్క అభిప్రాయానికి ఒక్కొక్క సమాజం ఉండటం అవసరమా! ప్రతిసమాజమునందునూ పై మూడు శాఖలు ఎందు కుండకూడదు? భగవద్భక్తి యెవరికక్కరలేదు? భగవద్విశ్వాసి కానివారు యే పనినైనా చేయగలుగుతారా? విద్యా విజ్ఞానాలులేని సమాజంవల్ల ప్రయోజనమేమి? వినోద క్రీడాకలాపములు లేని సమాజంలో ఉల్లాసోత్సాహాలకు తావుండునా? వీనికితోడు కళాపరిశ్రమలు చేరకున్న స్త్రీల ఆర్థికోపపత్తికి అవకాశముండునా?

కనుక ప్రతిసమాజము పైశాఖలన్నిటినీ కలిగి, వారివారి అభిరుచులకొద్దీ అన్నిరకముల స్త్రీలను ఆకర్షింప చేయగలిగినట్లైతే, వీని కనుబంధముగా రెడ్‌క్రాసు సొసైటీవలె బీదలగు వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్యము, చూలింతలకు మంత్రసానుల సరఫరా వగైరా సహాయములు చేయగల సేవాశాఖగూడ ఉన్నట్లైతే, స్త్రీ సమాజములు మంచిసేవను చేయగలవు. స్త్రీ సంఘమునకు వీనివలన మహోపకృతి గలుగగలదు.

మరియు ఆంధ్రదేశంలో చెల్లాచెదరుగావున్న స్త్రీ సమాజాలన్నీ ఒక్క కేంద్రసంఘంక్రిందకు తీసుకొనిరాబడి అన్యోన్య సహాయంతో, సలహాలతో పనిచేయడం గూడా చాలా అగత్యం. ఎచ్చటెచ్చట స్త్రీ సమాజాలున్నవో, అవి ఏవిధంగా పనిచేస్తున్నవో, వాటి అభివృద్ధికి చేయవలసిన సహాయమేమిటో, మహిళా సమాజములింకను విరివిగా దేశవ్యాప్తమగుటకు మార్గములేమిటో ఆలోచించుటకు కేంద్రసంఘం ఒక్కటే అర్హత గలిగి వున్నది. స్త్రీ సమాజముల నిర్వహిస్తూ ఉన్నవారూ, స్త్రీ సమాజముల ప్రయోజనమును గుర్తించిన వారూ, స్త్రీ జనాభివృద్ధి నాకాంక్షించేవారూ యీ విషయమై పర్యాలోచించి కేంద్ర సంఘమును స్థాపించుటకు పూనుకొందురని భావిస్తున్నాను.

స్త్రీసంఘ మిప్పుడు మునుపటివలె మైనరుసంఘం కాదు. పరపోషణ, పరసహాయ్యం దీనికిప్పుడు లేదు. భారత ప్రజాసంఖ్యలో అత్యాధిక సంఖ్యగలిగి అనేక స్త్రీసమస్యలను స్వయంగా పరిష్కరించుకొనవలసిన బాధ్యతను కలిగి ఉన్నది. కనుక ధనవంతులగు స్త్రీలు అధికంగా ధనసహాయం చేయాలె. విద్యావతులైన స్త్రీలు తమ మేధాశక్తిని బాగుగా వినియోగించాలె. సేవాపరాయణులగు స్త్రీలెందరో కష్టపడి పని చేయాలె. అప్పుడుగాని భారతమహిళలు సర్వతోముఖాభివృద్ధి జెంది సభ్యదేశతాగౌరవము నందజాలరు.

ప్రస్తుతము ప్రపంచపరిస్థితులు మనదేశపరిస్థితులు గూడా సవ్యముగాలేవు. ప్రపంచంలో యేమూలనున్నా స్త్రీ లందఱూ ఒకటే. ఐరోపాఖండమునందలి స్త్రీలు భయంకర సంగ్రామములో జిక్కుకొని కన్న బిడ్డలను ఏ కానిదేశాలకో దాచిపెట్టడానికి పంపి, ప్రియభర్తలను యుద్ధమునకు పంపి, తాము భయంకరాగ్నేయ గోళములమధ్య క్షణ క్షణ గండంతో అన్ని పరిపాలనా శాఖలలోనూ తామేయై దేశకార్యములు నడుపుతూ గాసిబడుతున్నారు.

మనదేశంలో అటువంటి ఆయుధయుద్ధం జరుగకపోయినా శాంతి సంగ్రామం జరుగుతూనే యున్నది. వేలకొలది సోదర సోదరీమణులు జైళ్లలో మ్రగ్గుతున్నారు. వెలుపలవున్నవారు గూడా యుద్ధమువల్ల నేర్పడిన ఆర్థికదుస్థితికి లోనై కటకట బడుతున్నారు. ఈ సందర్భమున నిర్మాణకార్యక్రమ మొకటి మహాత్మునిచే సూచితమై ఆర్థికోపద్రవమును తొలగింప యత్నించుచున్నది. నూలువడకుట అనాదిసిద్ధమైన గృహపరిశ్రమయేగాని క్రొత్తవిషయంగాదు. కావున స్త్రీలెల్లరు నూలువడకుట మూలముననుతదితర గృహపరిశ్రమలను నిర్వహించుట మూలముననుదేశదారిద్ర్యమును నివారించుటకు పూనుకొనవలెను. ఇంతే కాదు. నాగరికత కొఱకూ, విలాసంకొరకూ, సౌందర్యపోషణకొరకూ, గొప్పతనపు వైభవంకొరకూ, విదేశ వస్తువులను వాడటంకూడా మానివేయాలె. దేశీయపరిశ్రమలను త్రికరణశుద్ధిగా పోషించాలె. మాతృదేశ ఋణం తీర్చుకోడానికి ప్రతిఒక్కరూ ప్రయత్నించాలె.

ఈ బెజవాడపురమున నెలకొనియున్న భారతమహిళామండలి మంచి అభివృద్ధిలో ఉండి చక్కని భవనారామాది వసతులను గలిగి యుండటము యీ పురస్త్రీల అదృష్టమనియే చెప్పవలెను. సమస్త లక్షణములు కలిగి పక్వ ఫలమువలెనున్న యీ మహిళామండలిని పురస్త్రీలెల్లరు చక్కగా వినియోగించుకొని తగిన ప్రయోజన మందవలెనని నా కోరిక. నాకీ అవకాశము కలుగజేసిన భారత మహిళామండలివారికి నా కృతజ్ఞతాపూర్వక నమస్కారములు చెల్లిస్తూ నా ఉపన్యాసం ముగిస్తున్నాను.”